క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

పెనుమూరు(కార్వేటినగరం): ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి శుక్రవారం చార్వాకానిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని కావూరివారిపల్లి, సన్యాసనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొంటారని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం క్రిష్ణజమ్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బియ్యంను మంచి నీటితో కడిగిన తరువాతనే అన్నం చేయాలన్నారు. రసం, సాంబార్‌కు అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. హెచ్‌ఎం కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఫొటోల అప్‌లోడ్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీఓ బాల

పాలసముద్రం: ఉపాధి పనులు చేస్తున్న కూలీల ఫొటోలను రెండు పూటలా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఏపీవో బాల తెలిపారు. ఆయన గురువారం నరసింహపురం పంచాయతీలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పనులు చేస్తున్నట్లు మేట్ల సహాయంతో తమ ఫొటోలను ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. అప్పుడే హాజరు నమోదు అవుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫొటోలు అప్‌డేట్ చేయకపోతే పనులు చేసినా బిల్లులు రావన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో కృష్ణయ్య

శ్రీరంగరాజపురం: మండలంలోని వెంకటాపురం, ఉడమలకుర్తి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఎంపీడీవో కృష్ణయ్య తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. వారికి రోజు వారి వేతనం గరిష్ఠంగా రూ.257 అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చెరువు, కాలువల పూడికతీత, రోడ్లకు ఇరువైపులా ముళ్ల కంపల తొలగింపు తదితర పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఏపీవో చంద్రశేఖర్, సర్పంచ్ విజయ, చిట్టి, నాయకులు మహేష్, ఏకాంబరం, అమరావతి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రిక్తహస్తం



పుత్తూరులో ఏఐఎస్‌ఎఫ్ నాయకుల నిరసన

పుత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ విమర్శించారు. గురువారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు ఉందని ఆరోపించారు. బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులైనా విద్యా రంగానికి కేటాయించాల్సిందని అభిప్రాయపడ్డారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఆందోళనలను చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి చలపతి, స్థానిక నాయకులు బాబీ, తేజ, గౌతమ్, శ్రీధర్, అఖిల్, మహేష్, గోపి పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన నీలిమ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకే గృహ సారథుల నియామకం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: సచివాలయ సమన్వయకర్తలు, గృహ సారథులు సమష్టిగా చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వ పథకాల లబ్ధిని, వైఎస్సార్ సీపీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో నింద్ర మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు, పార్టీని పటిష్ఠం చేసేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. వలంటీర్లతో, గృహ సారథులతో కలిసి కన్వీనర్లు పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయికి అందేలా చూడాల్సిన బాధ్యత గృహ సారథులపైనే ఉందని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు, న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమం అందిస్తోందని, గత పాలకుల్లాగా దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం లేదని ప్రజలకు తెలియ చెప్పడంలో బాధ్యత సచివాలయాల మండల ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లే కీలకమని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గృహ సారథుల వల్ల వలంటీర్ల విధులకు ఏమాత్రం ఆటంకం ఉండదని, వలంటీర్లకు ఇచ్చే గౌరవం, ప్రాధాన్యం ఏమాత్రం తగ్గదని, ప్రతిపక్షాలు సృష్టించే అపోహలను నమ్మవద్దని సూచించారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కొత్తగా వీరిని నియమించారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ప్రభుత్వానికి రెండు కళ్లని తెలిపారు. కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, కోఆప్షన్ సభ్యుడు అనిల్, మండల కన్వీనర్ వేణురాజు, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి మేరీ, మండల సచివాలయ కన్వీనర్ ఏ.బాబురెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు గౌరీ, వసంతమ్మ, కేశవులు, ఎంపీటీసీ విజేష్, ఆర్బీకే చైర్మన్ వీరయ్య నాయుడు, డైరెక్టర్లు రమేష్, దినకర్, పంచాయతీ కన్వీనర్లు మహేష్, లక్ష్మీపతి, శివలింగం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

వడమాలపేట: ఎన్నికల హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని, నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. కులం, మతం, రాజయాలకు తావివ్వకుండా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎస్‌బీఆర్‌పురం సచివాలయ పరిధిలోని ఎస్‌బీఆర్‌పురం, ఎస్‌బీఆర్‌పురం దళితవాడలో గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామస్తులు పూల మాలలు, హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని అంకెలతో సహా వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందించారు. ఆయా గ్రామస్తులు విన్నవించిన స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే ఫించన్ మొత్తం అందిస్తున్నట్లు తెలిపారు. కన్న కొడుకులా, మేనమామలా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. తెలిపారు. మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి, తాహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ అరుణ, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు వెంట్రామరాజు, పీసీ చంద్రరాజు, సుదర్శన్‌రాజు, బాబు, తిమ్మయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌కుమార్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ చంద్రారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను ప్రోత్సహించింది టీడీపీనే



మట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం: బెల్టు షాపులను ప్రోత్సహించింది టీడీపీనే అని డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం శ్రీరంగరాజపురంలో విలేకరులతో మాట్లాడారు. వార్డు మెంబర్‌గా గెలవలేని నారా లోకేష్ అవివేకంతో ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్టీ రామారావు మద్యాన్ని నిషేధిస్తే చంద్రబాబునాయుడు దానికి తూట్లు పొడిచారని గుర్తు చేశారు. అలాగే బెల్ట్ షాపులతోపాటు నాటు సారాను ప్రోత్సహించారని విమర్శించారు. ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న పలు మద్యం బ్రాండ్లకు టీడీపీ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చినట్టు వివరించారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలని లోకేష్‌కు హితవుపలికారు. జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి కుప్పయ్య, నాయకులు జనార్దన్, మహేష్, భూపతిరెడ్డి, లోకనాథరాజు, బాబు, జయారాజ్, ఆనంద్ పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులతో కమిషనర్, శానిటేషన్ సిబ్బంది

నగరి: మున్సిపల్ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను కమిషనర్ వెంకట్రామిరెడ్డి స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల రవాణా బయటపడింది. రవాణాకు సిద్ధంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసు కున్నారు. వీటి విలువ రూ.పది వేలకు పైగానే ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని పేర్కొన్నారు. ప్రతి వార్డులోను ప్లాస్టిక్ వినియోగంపై ఆరాతీసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ భూపాల్, శానిటరీ సెక్రటరీలు పురుషోత్తం, కుమార్, వాసు, పీహెచ్ మేస్త్రీలు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరమణారెడ్డి,నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్లు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ పరిశీలకులు వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృపాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డితో కలిసి ఉగ్రాణంపల్లి, గుంటిపల్లి, పులికల్లు, శాతంబాకం, సీఆర్ కండ్రిగ, గంగుపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యదర్శి దూదిమోహన్, దాము, విజయకుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నవీన్‌కుమారెడ్డి, జయచంద్రారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు నాగార్జున వర్సిటీ ఆహ్వానం

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లెకు చెందిన ఆదర్శ రైతు జగదీష్‌రెడ్డిని గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆహ్వానించింది. గురువారం ఆయనకు ఆహ్వాన లేఖ అందింది. ఈ నెల 23, 24న ప్లాంటియన్స్ ఇన్ ప్లాంట్ అండ్ మైక్రోబయల్ రీసెర్చ్-2023పై జాతీయ సదస్సు నాగార్జున వర్సిటీ నిర్వహిస్తోందని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఆ సదస్సులో తాను ప్రసంగించనున్నట్లు జగదీష్‌రెడ్డి తెలిపారు.

నాటు బాంబు పేలి ఆవుకు గాయాలు



గాయపడిన ఆవు

పాలసముద్రం: మండలంలోని టీవీఎన్ ఆర్‌పురంలో గురువారం నాటు బాంబు పేలి ఒక పాడి ఆవు గాయపడింది. ఇటీవల టీవీఎన్‌ఆర్ పురం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు అడవి పందులను వేటాడేందుకు నాటు బాంబులు పెడుతున్నారు. గ్రామానికి చెందిన రైతు గోవిందరాజు ఆవులను మేపేందుకు తీసుకెళ్లాడు. పచ్చిక మేస్తున్న ఒక ఆవు నాటు బాంబును కొరికింది. బాంబు పేలడంతో ఆవు తీవ్రంగా గాయపడింది.

అక్కసుతో మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు

- మండిపడిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- అరెస్టు చేయాలంటూ డిమాండ్
- తప్పుడు మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరిక
- పథకాల లబ్ధి అందుతోందన్న టీడీపీ నాయకుడి తల్లి



టీడీపీ నేత ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయపురం: మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ మండల నాయకుడు వాసు అనుచిత వ్యాఖ్యలు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్ చేయడంపై వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఆగ్రహించారు. వెంటనే అరెస్టు చేయాలని గురువారం సాయంత్రం అతని ఇంటి ముందే బైఠాయించారు. సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి ఆర్కే రోజా, ఆమె కుటుంబ సభ్యులను ఉద్దేశించి నోటికొచ్చినట్లు వాగడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అనునిత్యం ప్రజలకోసం పాటుపడుతున్న ఆమెను విమర్శించే అర్హత టీడీపీకి లేదన్నారు. ప్రతి కుటుంబానికి తల్లిగా, అక్కగా, చెల్లిగా, ఆడపడుచుగా ఉంటూ సాయం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి బుధవారం పుత్తూరు, నగరి పట్టణాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు లేని బాలికను దత్తతకు తీసుకుని మెడిసిన్ చదివిస్తుస్తూ మానవీయత చాటుకుంటున్నారని తెలిపారు. అలాంటి మంచి వ్యక్తిని ఉద్దేశించి రాజకీయ దురుద్దేశంతో తప్పుడు మాటలు మాట్లాడితే సహించే ప్రసక్తే లేదన్నారు. జంబాడలో అభివృద్ధి కనిపించడంలేదంటున్న అతనికి పచ్చకామెర్లు వచ్చి కళ్లు మూసుకు పోయినట్లుందని తెలిపారు. జంబాడలోని నాలుగు వీధుల్లో సిమెంటు రోడ్లు వేశారని, అన్ని వీధుల్లో ఎల్ఈడీ లైట్లు వేశారని, నాడు-నేడు కింద సుమారు రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా పాఠశాల భవనం నిర్మించారని, తాగునీటి కోసం మూడు బోర్లు వేశారని, ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.15 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మించారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. 40 ఏళ్లు రాజకీయంలో కొనసాగినవారు చేయలేని పనులు ఆమె చేసి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌గోపాల్, శివరాజు, శేఖర్‌రాజు, సర్పంచ్ కుమార్, కుప్పయ్య, భాస్కర్, ప్రసన్న, రాజాదాస్, రత్నం, హరికృష్ణ, జిల్, సుబ్బుయాదవ్, రామ్‌రాజ్, నాగరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పథకాలూ అందుతున్నాయి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే మా ఇంటికి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నా కుమారుడు ఏం మాట్లాడాడో తెలియదు. మా అత్తకు పెన్షన్ వస్తోంది, మాకు రైతు భరోసా వస్తోంది, సున్నా వడ్డీ పథకం వస్తోంది, విద్యాదీవెన అందుతోంది. మా వాడు టీడీపీ నాయకుల మాట విని తెలియక ఏవేవో మాట్లాడేశాడు. మంచిచేసే ప్రభుత్వంపైనే విమర్శలు చేయడం బాధగా ఉంది.

-మంగమ్మ, టీడీపీ నాయకుడు వాసు తల్లి, జంబాడ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. ఆయన గురువారం పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని సోమేంద్రపురం, చవనపల్లె, పెరుమాళ్లపల్లె దళితవాడ, తార్లబైలు, గొడుగుచింత గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవడానికే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికీ పంపుతున్నారని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. గ్రామ సచివాలయాలతో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన ఘనత సీఎంకు దక్కుతుందని తెలిపారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

అర్హులందరికీ పథకాలు

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అధికారులను ఆదేశించారు. గ్రామాలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఆదేశించారు. ఎంపీడీఓ సుధాకరరావు, ట్రాన్స్‌కో ఏఈ రామాంజనేయులు, ఎంపీటీసీలు మురళీరెడ్డి, భాస్కర్, మునిచంద్రారెడ్డి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, సర్పంచులు బాబు, శశికుమారి, అన్నురాశి, ఉప సర్పంచ్ సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ పాల్గొన్నారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పనితీరు పరిశీలన



టెస్టింగ్ రిపోర్టును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్

నగరి: నగరి మార్కెట్ యార్డులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను గురువారం అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులను పరీక్షించే విధానాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ల్యాబ్‌లో 181 విత్తన శాంపిల్స్‌ను, 97 ఎరువుల శాంపిల్స్‌ను పరీక్షించినట్లు ల్యాబ్ ఏవో యామిని వివరించారు. టెస్టింగ్ రిపోర్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడీఏ, ఏవోలు రైతులకు టెస్టింగ్ ల్యాబ్ విశిష్టతను వివరించి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాల దుకాణదారులు కూడా నగదు చెల్లించి విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌లో పరీక్షించుకోవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అబీబ్ బాషా, చిత్తూరు డివిజన్ ఏడీఏ మధుసూదన్, నగరి డివిజన్ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ల్యాబ్ అనాలసిస్ట్ తులసీ జలంధర్, సెందామరమ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు పంచాయతీ అగ్రహారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ఇక్కడ 30 ఎకరాల్లో ఏడాది పొడవునా ఏయే పంటలు పండిస్తారు, మార్కెటింగ్ ఏవిధంగా చేస్తారు తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన బెల్లంను టీటీడీ కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. జేడీఏ హబీబ్ బాషా, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, డీపీఎం వాసు, మండల వ్యవసాయాధికారి వందన, మాజీ ఎంపీటీసీ జయరామన్ పాల్గొన్నారు.

5న పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమలలో 5వ తేదీ పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరుగనుంది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అలాగే రామకృష్ణ తీర్థ ముక్కోటిని ఘనంగా నిర్వహించనున్నారు. పురాణాలపరంగా తిరుమలలో 3.50 కోట్ల పుణ్యతీర్థాలు ఉన్నాయి. వీటిలో స్వామి పుష్కరిణి తీర్థం, కుమారధార తీర్థం, తుంబురు తీర్థం, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ తీర్థం, పాపవినాశన తీర్థం, పాండవ తీర్థం ప్రధానమైనవి. ఇందులో స్నానం ఆచరించిన భక్తులు ముక్తి పొందుతారని అర్యోక్తి.

తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సులోచన



నగరి: రుయాలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

పుత్తూరు రూరల్: పుత్తూరు 17వ వార్డుకు చెందిన షాపు స్ట్రీట్ సచివాలయ పరిధిలోని లబ్ధిదారురాలు పి.దేవి(38)కి తిరుపతి స్విమ్స్‌కు వెళ్లి వలంటీర్ పింఛన్ మొత్తం అందించారు. స్విమ్స్‌లో డయాలసిస్ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వలంటీర్ సులోచన బుధవారం రాత్రి అక్కడికి వెళ్లి రూ.10 వేలు పింఛన్ మొత్తాన్ని అందించారు.

రుయా ఆస్పత్రికి వెళ్లి..

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు సచివాలయ పరిధికి చెందిన భజగోవిందానికి తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లి వలంటీర్ పింఛన్ మొత్తం అందించారు. ఆయన రుయాలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుని వలంటీర్ విశాలాక్షి తిరుపతికి వెళ్లి పింఛన్ అందించారు. అనారోగ్యంగా ఆస్పత్రిలో ఉన్నా పెన్షన్ వెతుక్కుంటూ రావడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

దళితవాడలకు శ్మశాన వాటికలు



అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సుజన

కార్వేటినగరం: ప్రతి దళితవాడకూ శ్మశానవాటిక ఏర్పాటు చేయనున్నట్టు నగరి ఆర్డీవో సుజన తెలిపారు. ఆమె గురువారం గాజంకి, ఎర్రమరాజుపల్లి, రౌతువానిగుంట దళితవాడల శ్మశాన వాటికలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో సౌకర్యాలు కల్పించా లని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అనంతరం గాజంకి రోడ్డును పరిశీలించారు. గాజంకి సచివాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్కేవీబీపేట సచివాలయ పరిధిలోని అంబేడ్కర్ భవన నిర్మాణం, గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో మోహన్‌మురళి, మండల సర్వేయర్ సురేష్, కార్యదర్శి లోకేష్, మనోజ్, వీఆర్వో మురళి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఎస్.విద్యావతి, హిమంత్‌కుమార్

పాలసముద్రం: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలమని ఎంపీడీవో ఎస్.విద్యావతి తెలిపారు. ఆమె గురువారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్‌కుమార్‌తో కలిసి జగనన్న స్వచ్ఛ సంకల్పనపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పల్లెనూ స్వచ్ఛంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రీన్ అంబాసిడర్లతో ఎప్పటి కప్పుడు చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజు, మండల విస్తరణ అధికారి రమేష్, సర్పంచ్ అయ్యప్ప, పంచాయతీ కార్యదర్శి నరేష్, సుధాకర్ పాల్గొన్నాడు.

మహాశివరాత్రి ప్రత్యేకాధికారిగా రామచంద్రమోహన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం రామచంద్ర మోహన్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవదాయశాఖలో ఏడీసీగా పనిచేస్తున్న ఆయన ఈ నెల 10 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పర్యవేక్షిస్తారని తెలియజేశారు.